# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 299 | వరంగల్ | బుధవారం, 02 సెప్టెంబర్ 2026 | పేజీలు: 6

వరంగల్ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. చారిత్రాత్మక నేపథ్యం తో పాటు హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో ప్రధాన నగరంగా ఉంది. ఒకవైపు అర్బన్ ప్రాంతం, మరోవైపు రూరల్ ప్రాంతాలు ఉండటంతో కమిషనరేట్‌లో పరిస్థితులు భిన్నంగా ఉంటాయని, దీనిని సంపూర్ణంగా అర్థం చేసుకొని పోలీస్, ప్రజల మధ్య మంచి సేవలు అందించేందుకు కృషి చేస్తానని పోలీస్ కమీషనర్ ఎన్. శ్వేత అన్నారు. తాను ఏ పని చేసినా చట్టాలకు లోబడే పని చేస్తానని, ఆ పనితోనే గుర్తింపు రావాలని అనుకుంటానని తన మనసులో మాటగా చెప్పారు. సహజంగానే నాకు ఓపిక ఎక్కువ ఉంటుంది అని ఇక్కడి పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకొని ప్రజలకు న్యాయం చెయ్యడమే తన లక్ష్యం అని శ్వేత తెలిపారు. డిజిటల్ మీడియా యూనియన్ ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడిన పోలీస్ కమీషనర్, పోలీసింగ్ లక్ష్యాలు, శాంతి భద్రతలపై తన ఆలోచనలను పంచుకున్నారు.

- అక్షరశక్తి,
ప్రధాన ప్రతినిధి



# నాకు ఓపిక ఎక్కువ

5

- అందరి లక్ష్యం ప్రజలకు సేవ చెయ్యడమే
- క్రైమ్ రేటు తగ్గించడానికి కృషి
- మత్తు నియంత్రణలో సవాళ్లు ఉన్నాయి.
- ఏఐ తో స్మార్ట్ సేవలు
- పనితోనే గుర్తింపు రావాలి
- డిజిటల్ మీడియా ప్రతినిధులతో సీపీ ఎన్. శ్వేత

## వార్తల్లో విశ్వసనీయత ఉండాలి

- ప్రచురించే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలి
- ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేయాలి
- సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మొద్దు
- టీడీఎంయూ లోగో ఆవిష్కరణలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత



4

## వెయ్యి రోజుల పాలన.. హామీల అమలు ఏదీ?

కాంగ్రెస్ వైఫల్యాలపై పరకాలలో బీఆర్ఎస్ నిరసన



6






## అంతర్జాతీయ సదస్సుకు ప్రొఫెసర్ జ్యోతి, డాక్టర్ ఆదిరెడ్డి

**అక్షరశక్తి,హనుమకొండ:** చెన్నై వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24, 25 తేదీల్లో నిర్వహించనున్న అగ్రిటెక్-2026 అంతర్జాతీయ సదస్సుకు కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, కళాశాల పౌర సంబంధాల అధికారి డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి సంయుక్తంగా సమర్పించిన పరిశోధన పత్రం ఎంపికైంది. "వ్యవసాయం, గ్రామీణ ఆర్థికాభివృద్ధి: సుస్థిర, సమ్మిళిత అభివృద్ధికి సమగ్ర రూపకల్పన" అనే అంశంపై రూపొందించిన పరిశోధన పత్రాన్ని సదస్సు నిర్వాహకులు ఆమోదించారు. అంతర్జాతీయ స్థాయి సదస్సులో పరిశోధన పత్రాన్ని సమర్పించే అవకాశం లభించడం కళాశాలకు, అధ్యాపకులకు గర్వకారణమని వారు పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, ఉపాధి అవకాశాల పెంపునకు, రైతుల ఆదాయ వృద్ధికి కీలకమని పరిశోధన పత్రంలో విశ్లేషించినట్లు ప్రొఫెసర్ జ్యోతి, డాక్టర్ ఆదిరెడ్డి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర సాగు పద్ధతులు, నీటి నిర్వహణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఆహార శుద్ధి, మార్కెటింగ్, నైపుణ్యాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతుల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, నీటి కొరత, సహజ వనరుల క్షీణత వంటి సవాళ్ల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణతో కూడిన సుస్థిర వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన పత్రం ఎంపిక కావడంపై కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ఈ నెల 6న చిత్రకళా పోటీలు



**అక్షరశక్తి, హనుమకొండ:** బోనాలు, కృష్ణాష్టమి పండుగలను పురస్కరించుకుని సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ అండ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో 44వ చిత్రకళా పోటీలు ఈ నెల 6న ఆదివారం హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ క్రాస్‌రోడ్డులోని భారతి విద్యాభవన్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ డా. మంజుల సాగంటి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే పోటీలు ఐదు విభాగాల్లో జరుగుతాయని, రెండు గంటల వ్యవధిలో బోనాలు, కృష్ణాష్టమి అంశాలపై రెండు చిత్రాలు గీయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విజేతలకు 15 బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. పండుగల విశిష్టతను చిన్నారులకు తెలియజేసేలా ప్రత్యేక వేషధారణ పోటీలు కూడా నిర్వహించనున్నట్లు డా. మంజుల సాగంటి తెలిపారు. అమ్మవారు, బోనం ఎత్తిన మహిళ, పోతురాజు, కృష్ణుడు, గోపిక వంటి వేషధారణల్లో చిన్నారులు పాల్గొనవచ్చని, నాలుగు విభాగాల్లో మొత్తం 12 బహుమతులు అందజేస్తామని చెప్పారు. చిత్రకళపై ఆసక్తి ఉన్న వారు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు 8143643337 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.







# రేవంత్‌రెడ్డి మాటలు.. తుపాకీ రాముని మాటలు ఒక్కటే

- ఎర్రబెల్లి దయాకర్ రావు
- వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసనలు

**అక్షరశక్తి,పాలకుర్తి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు నిరసనగా పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణను బంగారు తెలంగాణ దిశగా తీసుకెళ్తున్న సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని మళ్లీ వెనక్కి తీసుకెళ్లిందని ఎర్రబెల్లి విమర్శించారు. విద్యుత్ కష్టాలు, యూరియా కొరత, సాగునీటి సమస్యలు వంటి ఇబ్బందులు ప్రజలను వేధిస్తున్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వాటిని అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. 1000 రోజులు గడిచినా హామీల అమలుపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను ప్రజలకు గుర్తు చేసేందుకే 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్నామని, ప్రతి గ్రామంలో 'బాకీ కార్డులు' పంపిణీ చేసి ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ పడిందో వివరిస్తున్నామని తెలిపారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పింఛన్ వంటి హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు రూ.లక్షతో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు కూలీలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో కళాశాలలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రైతు డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయని ఎర్రబెల్లి ప్రశ్నించారు. రైతు బీమా పథకానికి ప్రీమియం చెల్లించకుండా పథకాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. పండించిన ప్రతి పంటకు రూ.500 బోనస్, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వంటి హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఉద్యమాలు, పోరాటాలు చేయడం కొత్తేమీ కాదని ఎర్రబెల్లి అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాలనపై దృష్టి పెట్టకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలు చేయడం సరికాదని, కేసీఆర్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పోల్చడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు.

# పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానం





**అక్షరశక్తి,మంగపేట:** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి, ఉన్నత లక్ష్యాలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం మంగపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన 14 ల్యాప్‌టాప్‌లతో కూడిన కంప్యూటర్ ప్రయోగశాలను ఆమె ప్రారంభించారు. విద్యార్థినులు ఉన్నత విద్యకు వెళ్లే సమయానికి కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాల వినియోగంలో ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలని సూచించారు. కస్తూరిబా విద్యాలయాల్లో చదివిన విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని సీతక్క పేర్కొన్నారు. కన్నాయిగూడెం కస్తూరిబా విద్యాలయంలో పదో తరగతి వరకు చదివి, అనంతరం జవహర్‌నగర్‌లో ఇంటర్ చదివిన ఓ విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థినులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పట్టుదలతో చదివి పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. విద్యాలయంలో భోజన నాణ్యత, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ఇతర సౌకర్యాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకుని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థినులు భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వకుండా ఒంటరిగా బయటకు వెళ్లవద్దని మంత్రి సూచించారు. చదువుతోపాటు ఆరోగ్యం, పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని, శ్రమదాన కార్యక్రమాల్లో పాల్గొని విద్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అందుబాటులో ఉన్న స్థలంలో కూరగాయలు, జామ, మామిడి వంటి మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, జీసీడీఓ బుర్ర రజిత, మండల విద్యాశాఖ అధికారి మేనక, పాఠశాల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, ఉల్లాస్ సమన్వయకర్త కృష్ణ బాబు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే ను మరింత వేగవంతంగా పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**





**అక్షరశక్తి, హనుమకొండ:** భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన భూముల రీ సర్వేను మరింత వేగవంతంగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సర్వేయర్లను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో 3541 ఎకరాల భూమి ఉండగా ఇప్పటివరకు 2144 ఎకరాల భూమి రీసర్వే పూర్తి అయినట్లు సర్వేయర్లు కలెక్టర్ కు వివరించారు. పట్టాదారు పాస్ బుక్ లో నమోదైన భూమి విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో రైతు అనుభవిస్తున్న భూమి విస్తీర్ణానికి ఏమైనా తేడాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన రైతులు రాజిరెడ్డి, రామరాజు, సంపత్ రెడ్డి, సునీల్ రెడ్డి, మాధవి, సరోజన, నిర్మల,తదితర రైతులు భూముల రీ సర్వే జరుగుతున్న పంట పొలాల వద్ద ఉండగా కలెక్టర్ వారితో మాట్లాడారు.
రీ సర్వే జరుగుతున్న తీరును గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. భూముల రీ సర్వే చేస్తుండడం బాగుందని, రాష్ట్ర ప్రభుత్వం మంచి కార్యక్రమాన్ని చేపట్టిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వే ను మరో 15 రోజుల్లో పూర్తిచేయాలని సర్వేయర్లను ఆదేశించారు. రైతుల భూములను రీ సర్వే చేసిన వివరాలను ల్యాండ్ పార్సల్ మ్యాప్( ఎల్పీఎం)లో నమోదు ప్రక్రియ కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. రీ సర్వే తో భూముల హద్దులు, విస్తీర్ణం, పట్టాదారు వివరాల్లో స్పష్టత రావడంతో భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూ రికార్డులు అందుబాటులోకి వస్తాయని తెలియజేశారు. రోవర్లతో సర్వేయర్లు భూ రీసర్వే చేస్తుండగా కలెక్టర్ పరిశీలించి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే క్షేత్రస్థాయిలో పురోగతి బాగుండటంతో జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీరాం భూపాల్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా భూములు కొలతలు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, తహసిల్దార్ విక్రమ్ కుమార్, సర్వేయర్ సూరజ్, తదితరులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరశక్తి,హనుమకొండ:** ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 27 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక అవార్డులు-2026 కోసం పర్యాటక శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలు, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్టులు, పర్యాటక సంస్థలు తదితరులకు వివిధ విభాగాల్లో అవార్డులు అందించనున్నారు. రచన/ప్రచురణ, తెలంగాణ పర్యాటకంపై ఉత్తమ చిత్రం, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, రిసార్టులు, రెస్టారెంట్లు, పర్యాటక గైడ్, గ్రామీణ పర్యాటక ప్రాజెక్టు, పర్యాటక విద్యాసంస్థలు, వైద్య పర్యాటకం, వినోద పార్కులు, వినూత్న పర్యాటక ప్రాజెక్టులు, సామాజిక మాధ్యమాలు, యువ పర్యాటక క్లబ్ తదితర విభాగాల్లో అవార్డులు ప్రకటించనున్నారు.
హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్టులు తదితర విభాగాల్లో పనితీరు, వాతావరణం, పరిశుభ్రత, సేవలు, సౌకర్యాలు, పర్యాటకుల సంఖ్య, టర్నోవర్, విదేశీ మారకద్రవ్య ఆదాయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. పర్యావరణహిత విధానాలు, దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పునరుత్పాదక ఇంధన వినియోగం, వ్యర్థాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, కొత్త పద్ధతులు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పర్యాటక రచనల విభాగంలో తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రచురితమైన వ్యాసాలు అర్హత పొందుతాయి. ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, వైద్య పర్యాటక సంస్థలు తదితరులు అవసరమైన చోట చార్టర్డ్ అకౌంటెంట్ లేదా చట్టబద్ధ ఆడిటర్ ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.
అవార్డుల ఎంపిక కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీలు దరఖాస్తులను పరిశీలిస్తాయి. అవసరమైన సందర్భాల్లో సంబంధిత పర్యాటక ప్రాంతాలు, సంస్థలు, హోటళ్లు, రిసార్టులు తదితరాలను కమిటీ సభ్యులు స్వయంగా సందర్శించి పరిశీలిస్తారు. ఎంపికలో మార్గదర్శకాల్లో పేర్కొన్న అర్హతలు, పనితీరు, నాణ్యత, పర్యాటక రంగానికి అందించిన సేవలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఎంపిక ప్రక్రియలో పర్యాటక శాఖ డైరెక్టర్ నిర్ణయం తుది నిర్ణయంగా ఉంటుంది. అర్హత కలిగిన వారు పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ప్రతిపాదనలు, ధ్రువపత్రాలు, ఫొటోగ్రాఫ్‌లు, ఇతర ఆధారాలను జతచేసి సెప్టెంబర్ 7, 2026లోగా సమర్పించాలి. దరఖాస్తులను డైరెక్టర్, పర్యాటక శాఖ, తెలంగాణ ప్రభుత్వం, కళా భవన్, రవీంద్ర భారతి, సైఫాబాద్, హైదరాబాద్-500004 చిరునామాకు పంపాలి. వివరాల కోసం 9440816065, 9440816068 నంబర్లలో సంప్రదించవచ్చని పర్యాటక శాఖ తెలిపింది.

# కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరశక్తి,ములుగు:** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో నూతనంగా ప్రారంభించిన కేంద్రీయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి బాలవాటిక-1, 2, 3తో పాటు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ సీతారాం తెలిపారు. అర్హత కలిగిన చిన్నారుల తల్లిదండ్రులు సెప్టెంబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాల కోసం సెప్టెంబర్ 10న లాటరీ నిర్వహించి, 12న ప్రవేశ జాబితాలను ప్రకటిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి 21 వరకు సీట్ల కేటాయింపు, ప్రవేశ ప్రక్రియ పూర్తిచేసి, 23వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయ సంగఠన్ నిబంధనల ప్రకారం వయస్సు, అర్హత, ప్రాధాన్యతా క్రమం, రిజర్వేషన్లు వర్తిస్తాయని, మరిన్ని వివరాల కోసం జవహర్‌నగర్‌లోని పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

# కేయూ సెక్యూరిటీ ఏజెన్సీ తెలంగాణ వారికే ఇవ్వాలి

**వీసీ చాంబర్‌లో వివిధ విద్యార్థి సంఘాల నాయకుల నిరసన**



**అక్షరశక్తి,కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ సెక్యూరిటీ ఏజెన్సీని ఆంధ్ర ప్రాంతానికి చెందిన సంస్థలకు అప్పగించవద్దని డిమాండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ చాంబర్‌లో నిరసన తెలిపారు. సెక్యూరిటీ ఏజెన్సీ కాంట్రాక్టులో తెలంగాణ ప్రాంతానికి చెందిన సంస్థలకు ప్రాధాన్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నిరసనపై వైస్‌చాన్స్‌లర్ సానుకూలంగా స్పందిస్తూ, కేయూ సెక్యూరిటీ ఏజెన్సీని తెలంగాణ ప్రాంతానికి చెందిన వారికి ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు నాయకులు తెలిపారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఏజెన్సీకి కాంట్రాక్టు అప్పగిస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, అవసరమైతే యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ నిరసనలో డెమొక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ (డీఎస్ఏ) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్ మాదిగ, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ (ఎస్ఎస్‌యూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ స్వేరో, నాయకులు ఉప్పుల శివ, చెట్టుపల్లి శివకుమార్, గుండా వంశీ, వివేక్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన

**అక్షరశక్తి,వరంగల్:** రోడ్డు భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, ఐఏఎస్ బుధవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ కొత్త బస్టాండ్ నిర్మాణ పనులతో పాటు రహదారులపై ఏర్పడుతున్న నీటి నిల్వలు, గుంతలు, దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకుని నిర్ణీత ప్రమాణాలతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. లక్ష్మీపురం మార్కెట్ పరిధిలోని రహదారుల పరిస్థితిని కూడా కలెక్టర్ పరిశీలించి ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నీటి నిల్వలు లేకుండా చూడాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, ఏపీ సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో సుమ, ఆర్అండ్‌బీ ఈఈ రాజేందర్, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





## వెయ్యి రోజుల పాలనపై
# బీఆర్ఎస్ సమరభేరి

**తూర్పులో ఆందోళనలు**





**అక్షరశక్తి, వరంగల్:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని అండర్ బ్రిడ్జ్, మండిబజార్ ప్రాంతాల్లో ప్రజలకు 'బాకీ కార్డులు' పంపిణీ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హామీల అమలుపై ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. బాకీ కార్డుల పంపిణీ సందర్భంగా పలువురు ప్రజలు కూడా ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డివిజన్ ముఖ్య నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## నేత్రదానం, అవయవదానంపై
# విద్యార్థులకు అవగాహన

**అక్షరశక్తి,వరంగల్:** జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా సదాశయ ఫౌండేషన్, అభ్యుదయ సేవా సమితి, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేత్రదానం, అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు టి. శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని నేత్రదానం, అవయవదానం ప్రాధాన్యతను వివరించారు. మరణానంతరం నేత్రాలు, అవయవాలను దానం చేయడం ద్వారా పలువురి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని తెలిపారు. నేత్రదానం, అవయవదానంపై ఉన్న అపోహలను తొలగించి సమాజంలో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు మండల పరశురాములు, కళాశాల హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ పరమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ భగీరథ్, అధ్యాపకులు డా. మూర్తి, డా. శ్రీధర్, డా. సుస్మిత, రమేష్, కృష్ణవేణి, డా. రాజన్న, ప్రదీప్, ప్రభావతి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు. నేత్రదానం, అవయవదానంపై రూపొందించిన పోస్టర్లు, అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన పొందారు. తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ప్రజలకు నేత్రదానం, అవయవదానంపై అవగాహన కల్పించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



## కేయూ, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ మధ్య
# కీలక అవగాహన ఒప్పందాలు






**అక్షరశక్తి,కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ (కేయూ), ప్రముఖ స్వచ్ఛంద సంస్థ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ (యూడబ్ల్యూహెచ్) మధ్య విద్యార్థుల విద్యా, కెరీర్ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి రెండు కీలక అవగాహన ఒప్పందాలు కుదిరాయి. వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి సమక్షంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రమ్, యూడబ్ల్యూహెచ్ సీఈఓ రేఖా శ్రీనివాసన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా కేయూ పరిధిలో డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు చదువుతున్న ప్రతిభావంతులైన ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, కెరీర్ మార్గదర్శకత్వం, మెంటార్‌షిప్ సేవలు అందించనున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో కనీసం 75 శాతం మార్కులు, కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలలోపు ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఆర్మీ వెటరన్ల పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యంతో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ గైడెన్స్, మెంటార్‌షిప్ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ముఖ్యంగా 'స్టెమ్ ఫర్ హర్' కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం, అవకాశాలు కల్పించనున్నారు. ఈ కార్యక్రమాల అమలుకు కేయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ. సిద్ధార్థ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. వివరాలకు 9397666906 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఇక రెండో అవగాహన ఒప్పందంలో భాగంగా 'ప్లాంట్ ఫర్ ద ప్లానెట్' కార్యక్రమం ద్వారా కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఒక ఎకరం విస్తీర్ణంలో హైడెన్సిటీ విధానంలో 1,000 మొక్కలు నాటనున్నారు. మొక్కల సంరక్షణకు కాంపౌండ్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, నాటిన మొక్కల పరిరక్షణ, నిర్వహణ బాధ్యతలను యూడబ్ల్యూహెచ్ మూడేళ్లపాటు, 2029 మార్చి 31 వరకు చేపట్టనుంది. ఈ ప్రాజెక్టు అమలుతో కేయూకు ఎలాంటి ఆర్థిక భారం ఉండదని తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్. రమణ, యూడబ్ల్యూహెచ్ ప్రతినిధులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# వార్తల్లో విశ్వసనీయత ఉండాలి

- ప్రచురించే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలి
- ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేయాలి
- సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మొద్దు
- టీడీఎంయూ లోగో ఆవిష్కరణలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత




**అక్షరశక్తి, వరంగల్:** జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలను ప్రజల ముందుకు తీసుకురావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. వార్త కంటే వాస్తవం ముఖ్యం. సంచలనం కంటే ప్రజా ప్రయోజనం ముఖ్యమని అన్నారు. మంగళవారం తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ అధికారిక లోగోను కమిషనర్ శ్వేత ఆవిష్కరించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జర్నలిస్టు చేతిలోని కలం సమాజంపై ఎంతో ప్రభావం చూపుతుందని అన్నారు. అదే సమయంలో నిర్ధారణ లేని సమాచారం ప్రచురిస్తే వ్యక్తుల గౌరవానికి, ప్రతిష్ఠకు నష్టం కలిగే అవకాశం ఉందని చెప్పారు. అందువల్ల ఏదైనా వార్తను ప్రచురించే ముందు దాని వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒక సమాచారం సంచలనాత్మకంగా ఉన్నంత మాత్రాన దాన్ని వెంటనే వార్తగా మార్చకూడదని అన్నారు.

**ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకోవాలి**

ప్రస్తుతం సోషల్ మీడియా విస్తృతంగా అందుబాటులోకి రావడంతో ఏ సమాచారం అయినా క్షణాల్లో వైరల్ అవుతోందని కమిషనర్ శ్వేత అన్నారు. అయితే వైరల్ అవుతున్న ప్రతి సమాచారం వాస్తవం కాదని గుర్తుంచుకోవాలని సూచించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారాన్ని నిర్ధారించుకోకుండా ప్రచురించకూడదన్నారు. వైరల్ కావడం వేరు.. వాస్తవం కావడం వేరని అన్నారు. ఎక్కువ వ్యూస్, క్లిక్స్ కోసం సంచలనాత్మకంగా వార్తలను రూపొందించడం కంటే ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించడానికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, బాధితుల గళాన్ని వినిపించడం, అవినీతి, అక్రమాలను ఆధారాలతో వెలుగులోకి తీసుకురావడం జర్నలిజం లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. పోలీసులు, ప్రభుత్వ శాఖలు లేదా సంబంధిత అధికారుల నుంచి అధికారిక సమాచారం తీసుకున్న తర్వాతే ఏదైనా విషయాన్ని నమ్మాలని అన్నారు. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలు, బాధితులు, మహిళలు, పిల్లల విషయంలో వార్తలు రాసేటప్పుడు మరింత సంయమనం పాటించాలని సూచించారు. బాధితుల కష్టాలను సంచలనంగా మార్చకుండా వారి సమస్యలను సమాజం, అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా జర్నలిజం ఉండాలని అన్నారు. కార్యక్రమంలో టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు అరెల్లి కిరణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు, కోశాధికారి పల్లె వంశీ, ఉపాధ్యక్షుడు మోహన్, జాయింట్ సెక్రటరీ బూర నగేష్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, ఈసీ మెంబర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. చారిత్రాత్మక నేపథ్యం తో పాటు హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో ప్రధాన నగరంగా ఉంది. ఒకవైపు అర్బన్ ప్రాంతం, మరోవైపు రూరల్ ప్రాంతాలు ఉండటంతో కమిషనరేట్‌లో పరిస్థితులు భిన్నంగా ఉంటాయని, దీనిని సంపూర్ణంగా అర్థం చేసుకొని పోలీస్, ప్రజల మధ్య మంచి సేవలు అందించేందుకు కృషి చేస్తానని పోలీస్ కమీషనర్ ఎన్. శ్వేత అన్నారు. తాను ఏ పని చేసినా చట్టాలకు లోబడే పని చేస్తానని, ఆ పనితోనే గుర్తింపు రావాలని అనుకుంటానని తన మనసులో మాటగా చెప్పారు. సహజంగానే నాకు ఓపిక ఎక్కువ ఉంటుంది అని ఇక్కడి పరిస్థితులను పూర్తిగా అర్ధం చేసుకొని ప్రజలకు న్యాయం చెయ్యడమే తన లక్ష్యం అని శ్వేత తెలిపారు. డిజిటల్ మీడియా యూనియన్ ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడిన పోలీస్ కమీషనర్, పోలీసింగ్ లక్ష్యాలు, శాంతి భద్రతలపై తన ఆలోచనలను పంచుకున్నారు. - అక్షరశక్తి,ప్రధాన ప్రతినిధి

# నాకు ఓపిక ఎక్కువ



క్రైమ్ రేటు తగ్గించడానికి కృషి

మత్తు నియంత్రణలో సవాళ్లు ఉన్నాయి.

ఏఐ తో స్మార్ట్ సేవలు

పనితోనే గుర్తింపు రావాలి

డిజిటల్ మీడియా ప్రతినిధులతో సీపీ ఎన్. శ్వేత

## అందరి లక్ష్యం ప్రజలకు సేవ చెయ్యడమే

**సైబర్ క్రైం.. మిల్స్ కాలనీపై ప్రత్యేక దృష్టి**

వరంగల్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాల సంఖ్య కూడా ఎక్కువగానే ఉందని సీపీ శ్వేత తెలిపారు. సైబర్ కేసులను ప్రాపర్‌గా ఇన్వెస్టిగేట్ చేసి, బాధితులకు న్యాయం జరిగేలా కేసుల పరిష్కారంపై దృష్టి సారించామని చెప్పారు. మరోవైపు క్రైం ఇష్యూలు ఎక్కువగా నమోదవుతున్న మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. అక్కడ అదనపు ఎస్ఐని నియమించి క్రైం కంట్రోల్, పెట్రోలింగ్, నిఘాను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు.

**రౌడీయిజానికి నో ఛాన్స్**

రౌడీయిజాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని సీపీ స్పష్టం చేశారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు అవసరమైన చోట చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. నగరంలోని కాలనీలు, ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల పనితీరుపైనా దృష్టి సారించినట్లు తెలిపారు. సీసీ కెమెరాల నిర్వహణ, పనితీరును పరిశీలించే బాధ్యతను సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలకు అప్పగించామని, కాలనీ సమావేశాలు నిర్వహించి కెమెరాలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

**ట్రాఫిక్ నిరంతర ప్రక్రియ**

వరంగల్ నగరంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సీపీ తెలిపారు. ట్రాఫిక్ అనేది నిరంతరం ఉండే సమస్య అని, పోలీసుల చర్యలతో పాటు వాహనదారులు, ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. ముఖ్యంగా యూటర్న్‌లు, ఫ్రీ లెఫ్ట్‌లు, రోడ్డు సేఫ్టీ అంశాలపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. కరుణాపురంలో వైన్స్‌కు పెద్ద పర్మిట్ రూమ్ ఉండటంతో భారీగా ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మూడు యూటర్న్‌లను మూసివేసినట్లు తెలిపారు. దీంతో ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ సాఫీగా సాగుతోందన్నారు.

**శాఖల సమన్వయంతో చర్యలు...**

ప్రజల భద్రత, పోలీసింగ్‌లో ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని సీపీ శ్వేత చెప్పారు. ట్రాఫిక్, ఫ్రీ లెఫ్ట్‌లు, ఫుట్ పాత్ ఆక్రమణలు వంటి సమస్యలను ఒక్కసారిగా కాకుండా విడతల వారీగా పరిష్కరించుకుంటూ వెళ్తామన్నారు. పోలీసు శాఖ ఒక్కటే




అన్ని సమస్యలను పరిష్కరించలేదని, మున్సిపల్ కార్పొరేషన్, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. అధికారులు చర్యలు తీసుకున్నా ప్రజల భాగస్వామ్యం లేకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యం కాదన్నారు.

**స్టేషన్ల వారీగా క్రైం మ్యాపింగ్....**

కమిషనరేట్ పరిధిలోని ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల స్వభావాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని సీపీ తెలిపారు. మిల్స్ కాలనీ, మట్వాడ, ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో క్రైం కేసులు ఎక్కువగా ఉంటే, కేయూ, హసన్‌పర్తి ప్రాంతాల్లో భూ వివాదాలకు సంబంధించిన కేసులు అధికంగా నమోదవుతున్నాయని చెప్పారు. స్టేషన్ వారీగా క్రైం ప్యాటర్న్‌ను గుర్తించి, ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**భూ వివాదాల్లో ఎస్ఓపీనే ప్రామాణికం**

భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం, పోలీస్ శాఖ రూపొందించిన ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను పక్కాగా అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు సీపీ తెలిపారు. భూ వివాదాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా జోక్యం చేసుకోకుండా ఎస్ఓపీ ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుందని చెప్పారు. తాను కూడా ఎస్ఓపీని తప్పనిసరిగా పాటిస్తానని, నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

**సాంకేతిక వినియోగం...**

పరిపాలనా, పోలీసింగ్ పటిష్టత కోసం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగానికి సన్నద్ధం గా ఉన్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో తీసుకునే నిర్ణయాలను బట్టి ఏఐ వంటి సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించి ప్రజలకు విస్తృతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే వాట్సప్ ఎఫ్ఐఆర్‌లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

**పేరు కంటే పని ముఖ్యం..**

ఫలితం కోసం పోలీసు అధికారిగా తనకు పేరు, ఫేమ్ కోసం పనిచేయనని సీపీ శ్వేతారెడ్డి స్పష్టం చేశారు. చట్టాన్ని నమ్మి, దాని ప్రకారమే విధులు నిర్వర్తిస్తానన్నారు. తనకు చట్టపై నమ్మకం ఉందని, అలాగే శిక్ష పడే వరకు వేచి చూసే ఓపిక కూడా ఉందన్నారు. పోలీసింగ్ అంటే ప్రభావవంతంగా ఉండటంతో పాటు దాని ఫలితం ప్రజలకు కనిపించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ప్రజలకు భద్రత కల్పించడం, నేరాలను నియంత్రించడం, సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం చూపించడంపైనే తన దృష్టి ఉంటుందని సీపీ వెల్లడించారు.

**మత్తుపై ప్రత్యేక నిఘా...**

నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాలను పట్టిపీడిస్తున్న గంజాయిపై ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు సీపీ వెల్లడించారు. మత్తు పదార్థాల వినియోగం, సరఫరాను అరికట్టేందుకు పోలీసులతో పాటు సమాజ భాగస్వామ్యాన్ని పెంచుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా మహిళా సంఘాల సహకారం తీసుకుంటున్నామని చెప్పారు. తల్లులుగా మత్తు పదార్థాల వల్ల కుటుంబాలు, యువతపై పడుతున్న ప్రభావాన్ని మహిళలకు బాగా అర్థమవుతుందని, అందుకే వారిని భాగస్వాములను చేస్తున్నామన్నారు. మహిళా సంఘాల సభ్యులకు 'సంఘమిత్రలు'గా నామకరణం చేసి గంజాయి, ఇతర నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తాజాగా జనగామలో జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి, గంజాయికి అలవాటు పడిన వారిని గుర్తించడం, మత్తు పదార్థాల ప్రభావం, సమాజంలో జరుగుతున్న నేరాలపై వారికి అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు అందుబాటులో ఉండటంతో గంజాయి వినియోగం, సరఫరాపై క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించేందుకు ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**రౌడీషీట్ ఓపెన్ చేస్తాం..**

గంజాయి కేసుల్లో పదేపదే పట్టుబడుతున్న వారిపై నిఘా పెంచడంతో పాటు అవసరమైన చోట రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నట్లు సీపీ తెలిపారు. అయితే గంజాయి సరఫరాపై ప్రజల నుంచి పక్కా సమాచారం రావడం లేదన్నారు. 'ఇక్కడ ఉందట.. వాళ్లు తాగుతున్నారట' అనే సాధారణ సమాచారం కాకుండా, సరఫరా చేసే వ్యక్తులు, ప్రాంతాలు, వాహనాలు తదితరాలపై పక్కా సమాచారం అందిస్తే తక్షణమే దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

అక్షరశక్తి Evening Daily
6
బుధవారం, 02 సెప్టెంబర్ 2026
Telugu Trending News

# వెయ్యి రోజుల పాలన.. హామీల అమలు ఏదీ?

### కాంగ్రెస్ వైఫల్యాలపై పరకాలలో బీఆర్ఎస్ నిరసన



**అక్షరశక్తి,పరకాల:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పరకాలలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు 420 అడుగుల ఫ్లెక్సీతో భారీ ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించి, బస్టాండ్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రెండు లక్షల ఉద్యోగాల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని దేవుళ్లపై ఒట్లు వేసి, బాండ్ పేపర్లపై సంతకాలు చేసినప్పటికీ 1000 రోజులు గడిచినా హామీలు అమలు కాలేదని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, పేదలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలు మోసపోవడం ఖాయమని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగానే హెచ్చరించారని ధర్మారెడ్డి గుర్తుచేశారు. ఇక కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, ప్రజలు కర్రుకాల్చి వాతలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. హామీల అమలుపై ప్రభుత్వం స్పందించకపోతే నియోజకవర్గవ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## డాక్టర్ బాసని సురేష్ కు జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారం ప్రదానం



**అక్షరశక్తి, వరంగల్:** జానపద సాహిత్య పరిషత్తు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అందించే పురస్కారాలలో ఒకటైన డాక్టర్ చింతపల్లి వసుంధర రెడ్డి గారి జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారాన్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వరంగల్ జానపద గిరిజన విజ్ఞాన పీఠం లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బాసని సురేష్‌కు ప్రదానం చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ కూకట్ పల్లిలోని కృష్ణసింధూరి సంకల్ప లలిత కళా నిలయంలోని జానపద సాహిత్య పరిషత్తులో డాక్టర్ చింతపల్లి వసుంధరా రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వసుంధర రెడ్డి జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారాన్ని ముఖ్యఅతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఆత్మీయ అతిథి శ్రీ పమిడి కాల్వ మధుసూదన్ గారి చేతుల మీదుగా డాక్టర్ బా సని సురేష్ అందుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు అకాడమీ డైరెక్టర్ ఆచార్య భట్టు రమేష్, కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంతచార్యులు పాకనాటి జ్యోతి, జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న గారు, జానపద గిరిజన విజ్ఞాన పీఠం జూనియర్ అసిస్టెంట్ ఆమేర్ అలీ ఖాన్, అధ్యాపకులు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, అబ్బు గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, బుక్ బేరర్ సిద్ధోజు సునంద, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు ప్రత్యేక విచారణ కేంద్రాలు



**అక్షరశక్తి, హనుమకొండ:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఓటర్లకు సంబంధించిన నోటీసులు, అభ్యంతరాలపై విచారణ నిర్వహించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏఈఆర్ఓ విచారణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 50 విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయగా, కళాశాలలో ఐదు, ఆరు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన విచారణలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన ధ్రువపత్రాలతో విచారణ కేంద్రాలకు హాజరై ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలకు పత్రాలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. విచారణకు హాజరైన ప్రతి ఓటరు సమర్పించిన పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు హాజరు రిజిస్టర్‌లో సంతకం తీసుకోవాలని, రోజువారీగా వచ్చిన దరఖాస్తులు, విచారణలను అదే రోజు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విచారణ ప్రక్రియ అక్టోబర్ 18 వరకు కొనసాగుతుందని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు కూడా తుది ఓటర్ల జాబితాలో చోటు కోల్పోకుండా అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలు సమన్వయంతో పనిచేస్తూ నోటీసుల జారీ, ధ్రువపత్రాల స్వీకరణ, ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఓటర్లకు అవసరమైన సమాచారం అందించి, అర్హులైన వారు విచారణకు హాజరయ్యేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఈఆర్ఓ, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, హనుమకొండ ఏఈఆర్ఓ, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

### ఎన్. రామచందర్ రావు

**అక్షరశక్తి,పరకాల:** పరకాల అమరవీరుల త్యాగాలు తెలంగాణ విముక్తి పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు అన్నారు. పరకాల అమరధామంలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు సాగించిన పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎనభై ఏళ్ల క్రితం రజాకార్లు పరకాల చాపల బండ వద్ద 19 మందిని, లక్ష్మీపూర్‌లో మరో ముగ్గురిని హతమార్చారని, వందలాది మందిని చిత్రహింసలకు గురిచేశారని గుర్తుచేశారు. గుండ్రాంపల్లి, బైరాన్‌పల్లి ఘటనలు నాటి దారుణాలకు నిదర్శనమన్నారు.

సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేపట్టిన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని రామచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ విమోచన కోసం పీవీ నరసింహారావు, స్వామి రామానంద తీర్థ, వందేమాతరం



రామచంద్రరావు, షోయబుల్లా ఖాన్, తుర్రేబాజ్ ఖాన్ తదితరులు చేసిన పోరాటాలను ఆయన స్మరించుకున్నారు. గతంలో బీఆర్ఎస్ సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మజ్లిస్ ఒత్తిడితో విస్మరించిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా విమోచన పోరాట చరిత్రను అధికారికంగా గుర్తించడం లేదని విమర్శించారు.

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అధికారికంగా ప్రకటించాలని



రామచందర్ రావు డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తున్నప్పుడు తెలంగాణలో ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి భావితరాలకు అందిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 17న ప్రతి పల్లెలో, విద్యాసంస్థలో జాతీయ జెండాను ఎగురవేసి వందేమాతరం, జనగణమన గీతాలను ఆలపిస్తూ అమరవీరులకు నివాళులు అర్పించాలని ప్రజలకు, యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.